# హమారా వరంగల్

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 12

సోమవారం 27 జూలై 2026





## 9 సార్లు సీపీఆర్‌తో....

# ప్రాణం పోసిన వైద్యురాలు..!




- గుండె స్పందన ఆగిపోయినా ఆశ వదల్లేని వైద్యురాలు
- వరుసగా 9 సార్లు సీపీఆర్ చేసి మాజీ ఎమ్మెల్యేకు ప్రాణం పోసిన డాక్టర్ మమతారెడ్డి
- అంకితభావానికి హరీశ్‌రావు ప్రశంసలు
- రోహిణి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అనంతరం యశోదకు తరలింపు
- వైద్య వృత్తి గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పిన అరుదైన ఘటన



**హమారా వరంగల్ । హనుమకొండ**

హనుమకొండలో ఆదివారం చోటుచేసుకున్న ఓ హృదయాన్ని కదిలించే ఘటన వైద్య వృత్తి గొప్పతనాన్ని మరోసారి దేశానికి చాటి చెప్పింది. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురై హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి అత్యంత విషమంగా మారింది. గుండె స్పందన పూర్తిగా ఆగిపోయిన తరుణంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రాణాలను కాపాడాలనే ఒక్క లక్ష్యంతో ఎమర్జెన్సీ వైద్యురాలు డాక్టర్ మమతారెడ్డి అసాధారణ సేవలు అందించారు.

వైద్యరంగంలో అరుదుగా కనిపించే పట్టుదలతో వరుసగా 9 సార్లు సీపీఆర్ (ఝుతీసఱఅశీజూబశ్రీఎశీఝుతీఎ =వంబంఏక్షీఱశీఅ) నిర్వహించి చివరకు గుండె స్పందనను తిరిగి తీసుకురావడంలో ఆమె విజయం సాధించారు. అనంతరం అత్యవసర చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందిస్తూ, "గుండె ఆగిపోయినప్పటికీ ఆశ వదలకుండా, అపారమైన నిబద్ధతతో సేవలందించిన డాక్టర్ మమతారెడ్డికి ప్రత్యేక అభినందనలు. ఆమె చూపిన అంకితభావం ప్రతి వైద్యుడికి ఆదర్శం" అని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మరణంతో పోరాడిన 30 నిమిషాలు... చివరకు గెలిచిన వైద్య నైపుణ్యం వైద్యుల సమాచారం ప్రకారం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆస్పత్రికి తీసుకువచ్చే సమయానికి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. గుండె స్పందన ఆగిపోవడంతో వెంటనే ఎమర్జెన్సీ చికిత్స ప్రారంభించిన డాక్టర్ మమతారెడ్డి, ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా సీపీఆర్ ప్రారంభించారు.

**ఒక్కసారి... రెండుసార్లు... మూడుసార్లు...** ఇలా వరుసగా ఎనిమిది సార్లు చేసినప్పటికీ ఎలాంటి స్పందన కనిపించలేదు. అయినప్పటికీ ఆమె ఆశను వదల్లేదు. వైద్య బృందాన్ని సమన్వయం చేస్తూ మరోసారి ధైర్యంగా ప్రయత్నించారు. చివరకు తొమ్మిదో ప్రయత్నంలో గుండె స్పందించడం ప్రారంభించడంతో ఆస్పత్రిలో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్న వాతావరణం నెలకొంది.

### అభినందనల వెల్లువ

ఈ ఘటన తెలిసిన వెంటనే రాజకీయ, వైద్య, సామాజిక వర్గాలకు చెందిన పలువురు డాక్టర్ మమతారెడ్డిని అభినందించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ చివరి వరకు పోరాడిన ఆమె అంకితభావం వైద్య వృత్తి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడుతున్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, పెద్ది సుదర్శన్ రెడ్డి అభిమానులు కూడా వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షలు

యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రార్థిస్తున్నారు. ఆస్పత్రి వద్ద ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆరా తీస్తుండగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆయన త్వరగా కోలుకోవాలని శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రూ.2,278.14 కోట్ల నిధుల మంజూరు..

## సర్కార్ జీవో విడుదల

ఆదిలాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయ భూసేకరణ, అభివృద్ధి పనుల కోసం సిఎం రేవంత్ రెడ్డి హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీవో 36 ద్వారా రూ.2,278.14 కోట్ల నిధులను మంజూరు చేసింది.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర రక్షణ శాఖ, విమానయాన శాఖ జాయింట్ యూజర్ సర్వీస్ లకు ఇదివరకే అనుమతి ఇవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా భూసేకరణ, అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టింది. అంతేకాక ఇటీవల జిల్లా పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.2,278.14 కోట్ల నిధులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనుల్లో కీలక పరిణామం..

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ జీవో 36 ప్రకారం నిధులు మంజూరు చేయడం ఎయిర్ పోర్ట్ ఏర్పాటులో కీలక పరిణామంగా చెప్పవచ్చు. ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే శంకర్ పలు దఫాలుగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను కలిసి ఎయిర్ పోర్ట్ ఆవశ్యకతను వివరించారు. ఇందుకు కేంద్ర రక్షణ శాఖ నుండి ఇటీవల గ్రీన్ సిగ్నల్ లభించింది.

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో బలమైన అడుగులు పడడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్ పోర్టు ఏర్పాటుతో పాటు 2.5 కి. మీ. పరిధిలో రన్ వే, పర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాలకు మధ్య వారధిగా ఆదిలాబాదులో రక్షణ శాఖ సిబ్బంది శిక్షణకు అనువైన స్థలంగా గుర్తించారు.

**రూ.2,278 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు**

రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్ పోర్ట్ భూ సేకరణ, మౌలిక అభివృద్ధి పనులకు రూ. 2,278.14 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదిలాబాద్ నుండి అనుకుంటా గ్రామం వరకు ఆర్.అండ్.బి తరపున రూ.35 కోట్లు, 2200 ఎకరాల భూ సేకరణకు రూ.1, 510 కోట్లు, హై టెన్షన్ టవర్ల తొలగింపు ప్రత్యామ్నాయ విద్యుదీకరణ నిర్మాణానికి రూ.310 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజల్లో ఒక అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం కలిగింది. ఎయిర్ పోర్టు రాకతో ఇక ఆదిలాబాద్ జిల్లా ముఖచిత్రం మారబోతుందని, ఉపాధి అవకాశాలతో జిల్లాలో ఎంతోమంది జీవితాలు కూడా బాగుపడతాయని అభిప్రాయపడుతున్నారు.



# హైడ్రా చుట్టూ వివాదాల వలయం

హైదరాబాద్‌లో ఆక్రమణల తొలగింపు, చెరువుల పరిరక్షణ ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ప్రారంభించిన హైడ్రా వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన న్యాయపరమైన, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతుందని ప్రచారం పొందిన ఈ సంస్థ, ఇటీవల కొన్ని చర్యల వల్ల తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహానికి గురైంది. రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను విస్మరించి ముందుకు వెళ్తున్నారంటూ న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు, అవసరమైతే ఆర్మీని పిలిపించి మరీ కమిషనర్‌ను అరెస్టు చేయిస్తాం అని హెచ్చరించడం రాష్ట్ర రాజకీయ, ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.




కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదని హైడ్రాపై విమర్శలుఈ వివాదానికి ప్రధాన కారణం హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సిబ్బంది అనుసరిస్తున్న శైలేనని బాధితులు, న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, నోటీసులు ఇవ్వకుండా లేదా సహజ న్యాయ సూత్రాలను పాటించకుండా ప్రైవేటు ఆస్తుల చుట్టూ కంచెలు వేయడం, కూల్చివేతలకు దిగడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయస్థాన ఆదేశాలను ధిక్కరిస్తూ పరిధి దాటి ప్రవర్తిస్తే ఎంతటి ఉన్నతాధికారినైనా చట్టం ముందు నిలబెడతామని న్యాయమూర్తి స్పష్టం చేయడం, పరిపాలనా యంత్రాంగానికి ఒక గట్టి హెచ్చరికగా మారింది. చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా చేసే ఏ చర్యైనా రాజ్యాంగ విరుద్ధమేనని న్యాయస్థానం తేల్చిచెప్పింది.అయితే, ఈ విమర్శలు , కోర్టు ఆగ్రహం ఒకవైపు నడుస్తుండగానే.. మరోవైపు మిలిటరీ/ఆర్మీ యంత్రాంగం స్వయంగా హైడ్రా సాయాన్ని అర్థించడం అత్యంత ఆసక్తికరమైన పరిణామంగా మారింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ , పరిసర ప్రాంతాల్లో ఆర్మీకి చెందిన రక్షణ శాఖ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై సైనిక అధికారులు హైడ్రా కమిషనర్‌ను కలిసి సహాయం కోరారు.

# కొమురవెల్లి అభివృద్ధికి చారిత్రాత్మక అడుగు

- రైల్వే స్టేషన్ ప్రారంభంతో మల్లన్న భక్తులకు మహా వరం
- కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో క్షేత్రాన్ని జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

**హమారా వరంగల్ । కొమురవెల్లి**

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. లక్షలాది మంది మల్లన్న భక్తుల ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని నూతనంగా నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొమురవెల్లి మల్లన్న ఆలయం తెలంగాణకే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భక్తులు దర్శించుకునే అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాఘమాస జాతరలు, ప్రత్యేక పూజలు, పండుగలు, సెలవు రోజుల్లో లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారని, వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే అవసరం చాలా కాలంగా ఉందన్నారు. ఆ అవసరాన్ని తీర్చే దిశగా కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం ఒక చారిత్రాత్మక ముందడుగుగా అభివర్ణించారు.రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో భక్తులతో పాటు స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ స్టేషన్ వల్ల పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కొమురవెల్లి క్షేత్రాన్ని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సూచించారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, రవాణా వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.కొమురవెల్లి క్షేత్ర అభివృద్ధి కోసం గతంలో కూడా పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో కూడా క్షేత్ర సమగ్ర అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పన కోసం తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అలాగే, రైల్వే స్టేషన్ నిర్మాణానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ, సంబంధిత అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రైల్వే స్టేషన్ ప్రారంభంతో కొమురవెల్లి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మరింత చేరువ కానుందని, ఆధ్యాత్మిక పర్యాటక రంగం విస్తరించడంతో స్థానిక వ్యాపారాలు, చిన్నతరహా పరిశ్రమలు, సేవారంగానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. భక్తుల సంఖ్య పెరగడం ద్వారా జనగామ జిల్లా ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు.



# కార్గిల్ అమర వీరులకు బీజేపీ యువమోర్చా ఘన నివాళి

## కొవ్వొత్తుల ర్యాలీతో వీర జవాన్ల త్యాగాలను స్మరించిన బీజేవైఎం నాయకులు

## దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమర సైనికులు చిరస్మరణీయులు: ఎర్రబల్లి ప్రదీప్ రావు




**హమారా వరంగల్ । వరంగల్**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ఘన నివాళులర్పించారు. దేశభక్తిని చాటే నినాదాలు, చేతుల్లో కొవ్వొత్తులతో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "అమర జవాన్లు అమర్ రహే" నినాదాలతో పరిసరాలు దేశభక్తి భావంతో మార్మోగాయి. అనంతరం అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించి వారికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబల్లి ప్రదీప్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలగం రంజిత్ మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రపంచానికి భారత సైనిక శక్తిని చాటాయని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమర జవాన్ల త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత దేశభక్తిని అలవర్చుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, సైనికుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని పిలుపునిచ్చారు. కార్గిల్ విజయ్ దివస్ కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరుల వీరగాథలను గుర్తు చేసుకునే పవిత్ర సందర్భంగా అభివర్ణించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు చూపిన తెగువ, అంకితభావం వల్లే దేశ గౌరవం నిలిచిందని, సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి సైనికుడికి దేశ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని వారు పేర్కొన్నారు. అమర వీరుల కుటుంబాలకు దేశం అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుంచన క్రాంతి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాదాసు రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల మహేష్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు కోమాకుల నాగరాజు, ఎండోమెంట్ సెల్ కన్వీనర్ నాగరాజు, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ కార్తీక్ గౌడ్, జిల్లా నాయకులు ఆడెపు రవి, రామ్ తేజ్, జిల్లా కార్యదర్శులు పిట్టల వినయ్, సాయి తరుణ్, బీజేవైఎం నాయకులు అంకిత్ గౌడ్, అభి, నితీష్, శ్రీకాంత్, రస్మంత్తో పాటు జిల్లా, మండల స్థాయి బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించిన ఈ కొవ్వొత్తుల ర్యాలీ దేశభక్తిని చాటడమే కాకుండా, అమర జవాన్ల త్యాగాలను భావితరాలకు గుర్తు చేసే అర్థవంతమైన కార్యక్రమంగా నిలిచింది. భారతదేశం కోసం ప్రాణాలను అర్పించిన ప్రతి అమర వీరుడికి బీజేపీ యువమోర్చా నాయకులు, కార్యకర్తలు జోహార్లు అర్పించారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై మళ్లీ గళమెత్తిన ప్రజా స్వరం..!




## స్థానిక యువతకు 80% ఉద్యోగాలు ఇవ్వాలి -- కేంద్రానికి కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ డిమాండ్

**హమారా వరంగల్ । కాజీపేట**

కాజీపేట చౌరస్తా రైల్వే స్టేషన్ సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక దీక్షకు 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హాజరై సంఘీభావం తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన స్థానిక యువకులు, వారి కుటుంబాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో నిర్వహించిన ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక యువత, భూములు కోల్పోయిన రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జక్కుల రవీందర్ యాదవ్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగ యువతకు 80 శాతం ఉద్యోగాలు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి పేరుతో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అలాగే, ఈ అంశంపై గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కలిసి పార్లమెంట్‌లో చర్చ జరిగేలా కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక యువతకు న్యాయం జరిగే వరకు పార్టీలకు అతీతంగా తమ పోరాటం కొనసాగుతుందని, పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు

కాజీపేటను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (RMU)లో పనిచేస్తున్న భోగాసిబ్బంది, అప్రెంటీస్‌లకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగాల రిజర్వేషన్ అమలు చేయాలి. స్థానికుల హక్కులు, స్థానిక యువత ఉపాధి కోసం ఉద్యమం మరింత ఉద్ధృతం కానున్న సంకేతాలు కనిపిస్తున్నాయని దీక్షలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.

# కార్గిల్ అమర వీరులకు కాజీపేటలో ఘన నివాళి

## క్యాండిల్ ర్యాలీతో వీర జవాన్ల త్యాగాలను స్మరించిన మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్

## దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర సైనికుల సేవలు చిరస్మరణీయం.. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



**హమారా వరంగల్ । కాజీపేట**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కాజీపేటలో దేశభక్తి ఉట్టిపడేలా మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఘనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కాజీపేట చౌరస్తా వరకు కొనసాగింది. చేతుల్లో కొవ్వొత్తులు, జాతీయ జెండాలతో పాల్గొన్న నాయకులు, మాజీ సైనికులు, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ర్యాలీ సందర్భంగా "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "అమర జవాన్లు అమర్ రహే" నినాదాలతో కాజీపేట మార్మోగింది. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కార్గిల్ యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రాణాలను అర్పించిన వీర సైనికుల సేవలను కొనియాడుతూ రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్ మాట్లాడుతూ, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన పరాక్రమం దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. మంచుతో కప్పబడిన పర్వత శిఖరాల్లో అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన మన వీర జవాన్ల త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశం కోసం కుటుంబాలను, వ్యక్తిగత జీవితాన్ని పక్కనబెట్టి సరిహద్దుల్లో అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన అన్నారు. కార్గిల్ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని, ముఖ్యంగా యువతలో దేశభక్తి, జాతీయ చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న భారత సైనికుల ధైర్యసాహసాల వల్లే దేశ గౌరవం నిలిచిందని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని ఆయన పేర్కొన్నారు. అమర జవాన్ల కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది వేణుగోపాల్ నేత, శ్రీనివాస్ నేత మాట్లాడుతూ, కార్గిల్ విజయ్ దివస్ కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదని, దేశ సమగ్రత కోసం ప్రాణాలను అర్పించిన సైనికుల ధైర్యాన్ని గుర్తు చేసుకునే పవిత్ర సందర్భమని అన్నారు. భారత సైన్యం దేశానికి ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ర్యాలీలో చిలకపాటి శివ, మల్లేశం గౌడ్, రఘు, వై. వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ఎంపీ సమతా రాజు, బాబు గౌడ్, కొండ శివ యాదవ్, సుధీర్, రామ్కి గౌడ్, సర్వర్, నూన శ్రీనివాస్, రూమేష్, ఇర్ఫాన్, చిన్నాపెద్దా, రణధీర్, మోహన్ లాల్, వేణు, వెంకన్న, బిలాల్, అజిత్తో పాటు పలువురు మాజీ సైనికులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించిన ఈ క్యాండిల్ ర్యాలీ దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, అమర వీరుల త్యాగాలను నేటి తరానికి గుర్తు చేసే అర్థవంతమైన కార్యక్రమంగా నిలిచింది. దేశం కోసం ప్రాణాలను అర్పించిన ప్రతి జవాన్‌కు కాజీపేట ప్రజలు ఏకకంఠంతో జోహార్లు అర్పించారు.

# పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని మోదీ సంచలన నిర్ణయం..



పేపర్‌లీక్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ మరో వీడియో రిలీజ్ చేశారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు ప్రముఖ సాంకేతిక నిపుణుడు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిలీజ్ చేసిన వీడియో పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తు, పేపర్ లీకేజీల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకత పెంపు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం ప్రకటించారు. నందన్ నిలేకని ఆధ్వర్యంలో హైపవర్డ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేలా సమగ్ర సంస్కరణలు చేపట్టనున్నట్లు ప్రధాని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు భారత ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఎవరూ తప్పించుకోలేరని, ఇప్పటికే తప్పు చేసిన వారు జైళ్లలో మగ్గుతున్నారని ఆయన హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను మరింత పెంచేందుకు, తప్పులకు పాల్పడేవారిపై సత్వర విచారణ జరిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుల విచారణ వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత కఠినమైన చట్టాన్ని పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు మోదీ ప్రకటించారు.

నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

కేవలం శిక్షలే కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మన పరీక్షల విధానం మరింత పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే ప్రపంచ ప్రసిద్ధ సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఈ టాస్క్ ఫోర్స్ అందించే నివేదిక ఆధారంగా పరీక్షల వ్యవస్థ ప్రక్షాళనకు తగిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

నందన్ నిలేకని ఎవరంటే ?

నందన్ నీలేకని భారత్‌లో అత్యంత ప్రసిద్ధులైన ప్రముఖ సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్త.. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ దిగ్గజ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్' సహ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. అంతేకాకుండా ఆ సంస్థకు సీఈఓగా, ఛైర్మన్‌గా కూడా సేవలందించారు.. భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆధార్ ప్రాజెక్టుకు తొలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. కేంద్ర కేబినెట్ మంత్రి హోదాలో ఆయన దేశ ప్రజలందరికీ బయోమెట్రిక్ గుర్తింపు సంఖ్య (ఆధార్) అందించడంలో కీలక పాత్ర పోషించారు.

సాంకేతిక, ఆర్థిక రంగాలకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2006లో ఆయనను దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ తో సత్కరించింది. అలాగే టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తులలో ఒకరిగా ఆయన్ను పేర్కొంది. దేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలోనూ, విద్యారంగంలో సాంకేతికతను జోడించే కార్యక్రమాలలోనూ ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

# రాజారపు రమేష్ కుటుంబంలో ఆనందోత్సవం

## చిన్నారి ఊయల వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి

**హమారా వరంగల్ । వరంగల్**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 62వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ వ్యక్తిగత సహాయకుడు (పి.ఏ.) రాజారపు రమేష్ కుటుంబంలో నిర్వహించిన చిన్నారి ఊయల వేడుక (Cradle Ceremony) ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందిస్తూ, చిన్నారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఉన్నత భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి గారి ఆత్మీయ సమక్షం వేడుకకు ప్రత్యేక శోభను తీసుకువచ్చిందని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ఆహ్వానాన్ని స్వీకరించి విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించినందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొని చిన్నారికి ఆశీస్సులు అందించారు. కుటుంబంలో నెలకొన్న ఈ ఆనందోత్సవం ఆత్మీయత నడుమ చిరస్మరణీయంగా సాగింది.



## హెల్త్

# మీ మల్లె చెట్టు చిన్నదైనా కొమ్మ కొమ్మకి పూలు పూయాలంటే ఇలా చేయండి.



మల్లె మొక్కకు ఎంత సంరక్షణ చేసినా పూలు రావడం లేదా? అయితే సరైన సమయంలో ప్రూనింగ్ చేయడం, పోషకాలు అధికంగా ఉండే ఎరువులు వేయడం, తగినంత సూర్యరశ్మి అందించడం ద్వారా మల్లె మొక్కను మొగ్గలు, పూలతో నింపవచ్చని తోటమాలి నిపుణులు చెబుతున్నారు. ఈ సులభమైన చిట్కాలను పాటిస్తే కుండీలోనైనా, నేలలోనైనా మల్లె మొక్క విరివిగా పుష్పించి మీ ఇంటిని సువాసనతో నింపుతుంది.

మంచి అందమైన, సువాసన వచ్చే మొక్కలలో మల్లె మొక్కలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు అందరి ఇళ్లల్లోనూ మల్లె మొక్కలు ఉంటాయి.. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.. అయితే.. మీ దగ్గర మల్లె మొక్క ఉండి, దానికి సరిగా పూలు రాకపోయినా, లేదా ఎంత ప్రయత్నించినా పుష్పించకపోయినా, ఈ కథనంలో నిపుణులైన తోటమాలి అందించిన అమూల్యమైన చిట్కాలను తెలుసుకుందాం. ఈ సూచనలను పాటించడం ద్వారా మీ మల్లె మొక్క కూడా మొగ్గలు, పూలతో నిండిపోయి, మీ తోటను సువాసనతో నింపుతుంది. మల్లె మొక్కలు విరివిగా పూయడానికి మూడు ముఖ్యమైన అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.. సరైన సమయంలో ప్రూనింగ్ చేయడం, మొక్కకు అవసరమైన పోషకాలను అందించే మంచి ఫర్టిలైజర్ వాడకం, తగినంత సూర్యరశ్మి. ఈ మూడు విషయాలను దృష్టిలో ఉంచుకొని మల్లె మొక్కల సంరక్షణ చేసినట్లయితే అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు. ఈ పద్ధతులు కంటైనర్‌లలో పెంచుకునే మొక్కలకైనా లేదా నేల మీద ఉన్న మొక్కలకైనా చాలా బాగా పనిచేస్తాయి.. ముఖ్యంగా ఈ సీజన్‌లో మల్లె మొక్కల సంరక్షణతో బాగా పూలు పూస్తాయి..సరైన

ప్రూనింగ్: మల్లె మొక్కలకు పూలు ఎప్పుడూ కొత్తగా వచ్చే కొమ్మలకు మాత్రమే వస్తాయి. పాతవి, ఓల్డ్ అయిపోయిన కొమ్మలకు పూత రాదు. అందుకే ప్రూనింగ్ అనేది చాలా ముఖ్యం. ఇది మొక్కకు కొత్త చిగుర్లు, కొమ్మలు రావడానికి సహాయపడుతుంది, ఫలితంగా ఎక్కువ పూలు వస్తాయి.

మంచి ఫర్టిలైజర్ అందించడం:

ప్రూనింగ్ చేసుకున్న తర్వాత ఏ మొక్కలకైనా సరే మంచి ఫర్టిలైజర్ ని ఇవ్వడం చాలా అవసరం. మల్లె మొక్కలు కూడా ఫర్టిలైజర్ ని బాగా ఇష్టపడతాయి. ముఖ్యంగా గత సమ్మర్‌లో ఇచ్చిన తర్వాత మళ్ళీ మనం వాటిని నిర్లక్ష్యం చేసి, ఎరువులు వేసి ఉండకపోవచ్చు. కాబట్టి, పుష్కలంగా పూలు రావాలంటే ఖచ్చితంగా మంచి పోషకాలను అందించాలి. బయో-ఆర్గానిక్ బోన్‌మీల్, రాక్ ఫాస్ఫేట్, ఆవపిండి, వేరుశెనగ పిండి వంటివి మల్లె మొక్కల పుష్పించడానికి బాగా సహాయపడతాయి. ఈ ఫర్టిలైజర్‌లను క్రమం తప్పకుండా, సరైన మోతాదులో ఇవ్వడం వల్ల మొక్కకు కావలసిన పోషకాలు అంది, ఆరోగ్యంగా పెరుగుతుంది.

తగినంత సూర్యరశ్మి:

మల్లె మొక్కలకు ఎండ అవసరం. అసలు మల్లె పూలు ఎక్కువగా ఎండ బాగా ఉన్న టైంలోనే పూస్తాయి. కాబట్టి, మీ మల్లె మొక్కను ఎండ బాగా తగిలే ప్రదేశంలో ఉంచండి. రోజుకు కనీసం 6-8 గంటల సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఎండ సరిగా తగలకపోతే, మొక్క పెరిగినా కూడా పూలు సరిగా పూయవు లేదా పూలు చిన్నవిగా వస్తాయి.తోటమాలి అందించిన ఈ చిట్కాలను పాటిస్తే, మీ చిన్న మల్లె మొక్క కూడా కొమ్మకొమ్మకి మల్లెపూలను పూస్తుంది. కంటైనర్లలో పెంచుకుంటున్న మొక్కలు కూడా చాలా చక్కగా పూస్తాయి. మీ తోటను సువాసనభరితం చేయడానికి ఈ చిట్కాలు తప్పకుండా పాటించండి.

# మధ్యాహ్నం నిద్రపోవడం మంచిదేనా?

## - పరిశోధనలు ఏం చెబుతున్నాయో తెలిస్తే



రోజంతా ఆఫీస్ పని లేదా ఇంటి పనుల్లో నిమగ్నమైన తర్వాత మధ్యాహ్నం కాసేపు కళ్లు మూతలు పడటం చాలామందికి అనుభవమే. కొందరు అలవాటు కొద్దీ మధ్యాహ్నం పడుకుంటే, మరికొందరు రాత్రి సరిగ్గా నిద్రపోక మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటారు. అయితే, మధ్యాహ్నం నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిదా? కాదా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. సైంటిఫిక్ రీసెర్చ్ ప్రకారం మధ్యాహ్న నిద్ర వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు ఇక్కడ తెలుసుకోండి.రాత్రివేళ 7 నుండి 8 గంటల నిద్ర ఎంత ముఖ్యమో, మధ్యాహ్నం కొద్దిసేపు నిద్రపోవడం కూడా అంత ప్రయోజనకరమని పరిశోధనలు చెబుతున్నాయి. రోజంతా పనిచేసిన తర్వాత మధ్యాహ్నం కాసేపు అలసటగా అనిపించడం సర్వసాధారణం. నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మాటిక్స్ అధ్యయనం ప్రకారం... సరైన సమయంలో, సరైన వ్యవధిలో మధ్యాహ్నం నిద్రపోవడం వల్ల శరీరం, మెదడు రీఫ్రెష్ అవుతాయి. కేవలం 10 నుండి 20 నిమిషాల పవర్ నాప్ వల్ల లాభనష్టాలేంటో ఇప్పుడు చూద్దాం..

పరిశోధనలు ఏం చెబుతున్నాయి?: నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ నివేదిక ప్రకారం, మధ్యాహ్న సమయంలో సరైన ప్రమాణంలో నిద్రపోవడం వల్ల శరీరానికి, మెదడుకు ఎంతో మేలు జరుగుతుంది. రోజువారీ అలసటను తొలగించి శక్తిని పునరుద్ధరించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది.10 నుండి 20 నిమిషాల పవర్ నాప్ ప్రయోజనాలు: పరిశోధనల ప్రకారం, మధ్యాహ్నం 10 నుండి 20 నిమిషాల పాటు చిన్న కునుకు (గాశీషవతీ చీఖజూ) తీయడం వల్ల శారీరక అలసట, మానసిక ఒత్తిడి తక్షణమే తగ్గుతాయి. మెదడు చురుగ్గా మారి, పనిలో ఏకాగ్రత, ఉత్పాదకత పెరుగుతాయి. మానసిక స్థితి మెరుగుపడుతుంది.

ఎంతసేపు నిద్రపోవడం సురక్షితం?: మధ్యాహ్న నిద్ర 30 నిమిషాల కంటే తక్కువగా ఉన్నప్పుడే గరిష్ఠ ప్రయోజనాలు లభిస్తాయి. ఎందుకంటే, తక్కువ సమయంలో నిద్రపోవడం వల్ల శరీరం ప్రశాంతపడుతుంది. కానీ, గాఢ నిద్ర స్థితికి వెళ్లదు. దీనివల్ల నిద్రలేచిన వెంటనే శరీరం సులువుగా ఉత్తేజితమవుతుంది.

ఎక్కువ సమయం నిద్రపోతే జరిగే నష్టాలు: ఒకవేళ మీరు మధ్యాహ్నం 90 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువ సేపు నిద్రపోతే ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువ. గాఢ నిద్ర నుండి ఒక్కసారిగా లేవడం వల్ల మెదడు మొద్దుబారినట్లు అనిపిస్తుంది, తలనొప్పి, రోజంతా బద్ధకం ఆవహిస్తాయి. అలాగే, మధ్యాహ్నం ఎక్కువసేపు నిద్రపోవడం వల్ల రాత్రివేళల్లో సరైన సమయానికి నిద్రపట్టక నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది. మధ్యాహ్న నిద్ర మంచిదే, కానీ అది కేవలం 10 నుండి 20 నిమిషాల 'పవర్ నాప్'గా ఉన్నంతవరకే! మీ రోజువారీ దినచర్యలో ఈ చిన్న కునుకును భాగం చేసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు.

## బిజినెస్

# వెండి దిగుమతులకు బ్రేక్..




## - భారత్‌లో సరఫరా సంక్షోభం..
## - మరింత పెరగనున్న వెండి ధరలు!

**ఢిల్లీ :** ప్రస్తుతం దేశీయ ఉత్పత్తిదారుల సరఫరాపైనే మార్కెట్ ఎక్కువగా ఆధారపడుతోంది. పండుగల సీజన్, పెళ్లిళ్ల సీజన్‌లో డిమాండ్ మరింత పెరిగితే వెండి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. సరఫరా సాధారణ స్థితికి..భారత్‌లో వెండి మార్కెట్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వెండి దిగుమతులపై కఠినమైన లైసెన్సింగ్ నిబంధనలు అమల్లోకి రావడంతో దేశీయ మార్కెట్లో వెండి సరఫరా భారీగా తగ్గింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్ ధరలతో పోలిస్తే భారత్‌లో వెండి ప్రీమియం (అదనపు ధర) గత ఆరు నెలల్లోనే అత్యధిక స్థాయికి చేరుకుంది.

దిగుమతులు భారీగా తగ్గిన కారణం

కేంద్ర ప్రభుత్వం మే నెల నుంచి వెండి దిగుమతులపై కఠిన నియంత్రణలు అమలు చేసింది. అనంతరం జూన్‌లో వెండి గ్రెయిన్, వెండి పౌడర్ వంటి రూపాలను కూడా పరిమిత దిగుమతి జాబితాలో చేర్చింది. ఇప్పుడు వెండి దిగుమతి చేయాలంటే ముందస్తు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ చర్యలతో వెండి దిగుమతులు ఒక్కసారిగా పడిపోయాయి.

జూన్‌లో కేవలం 29 టన్నులే

మెటల్స్ ఫోకస్ అంచనాల ప్రకారం, ఈ ఏడాది జనవరిలో సుమారు 747 టన్నుల వెండి దిగుమతి కాగా, జూన్‌లో అది 29 టన్నులకు మాత్రమే పరిమితమైంది. దేశ వార్షిక అవసరాల్లో ఇది 1 శాతం కంటే కూడా తక్కువ. దీంతో మార్కెట్లో సరఫరా కొరత ఏర్పడింది.

ఎందుకు ఈ నిర్ణయం?

భారత్ తన వెండి అవసరాల్లో 80 శాతం కంటే ఎక్కువను దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గించడం, రూపాయి విలువకు మద్దతు ఇవ్వడం, వాణిజ్య లోటును నియంత్రించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఇదే సమయంలో బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను కూడా పెంచింది.

మార్కెట్లో వెండి కొరత

దిగుమతులు దాదాపు నిలిచిపోవడంతో వ్యాపారులు వెండి కోసం అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో వెండి ధరలు అంతర్జాతీయ ధరల కంటే 10 శాతం వరకు అధికంగా ట్రేడ్ అవుతున్నట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు.

డిమాండ్ ఎక్కడి నుంచి?

భారత్‌లో వెండికి నగలు, నాణేలు, వెండి బార్లు, సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారీ డిమాండ్ ఉంది. గత ఏడాది నుంచి వెండి ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు పెరగడంతో పెట్టుబడి అవసరాల కోసం కూడా వెండి కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయి.

ఇక ముందు ఏమవుతుంది?

ప్రస్తుతం దేశీయ ఉత్పత్తిదారుల సరఫరాపైనే మార్కెట్ ఎక్కువగా ఆధారపడుతోంది. పండుగల సీజన్, పెళ్లిళ్ల సీజన్‌లో డిమాండ్ మరింత పెరిగితే వెండి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. సరఫరా సాధారణ స్థితికి చేరుకునే వరకు దేశీయ మార్కెట్లో వెండి ధరలు అంతర్జాతీయ ధరల కంటే అధికంగానే కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఇండియా పోస్ట్ - ఫ్లిప్‌కార్ట్ క్రేజీ డీల్..

## - గ్రామాల్లో ఇక తపాలా సిబ్బందే పార్శిల్ డెలివరీ!



**ఢిల్లీ :** భారతదేశ ఈ-కామర్స్ లాజిస్టిక్స్ వ్యవస్థను బలోపేతం చేయడానికి, తపాలా శాఖ ఫ్లిప్‌కార్ట్ ఇండియా పార్శిల్ డెలివరీ సేవల కోసం భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. దేశంలోని మారుమూల ప్రాంతాలకు డెలివరీ సామర్థ్యాలను పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ, తపాలా శాఖ - ఫ్లిప్‌కార్ట్ ఇండియా ఒక చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశాయి.

తపాలా శాఖ, ఫ్లిప్‌కార్ట్ ఇండియా ఢిల్లీలో ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. తపాలా సాటిలేని విస్తృతి, విశ్వసనీయమైన డెలివరీ నెట్‌వర్క్, అలాగే భారతదేశ ఈ-కామర్స్ రంగంలో ఫ్లిప్‌కార్ట్‌కు ఉన్న బలమైన ఉనికిని ఉపయోగించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా సమర్థవంతమైన, నమ్మకమైన, వినియోగదారుల-కేంద్రీకృత పార్శిల్ డెలివరీ పరిష్కారాలను అందించడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఈ ఒప్పందం ప్రకారం, తపాలా శాఖ భారతదేశవ్యాప్తంగా ఫ్లిప్‌కార్ట్ సరుకుల కోసం లాస్ట్-మైల్ డెలివరీ సేవలను అందిస్తుంది.

ఒప్పందంలోని కీలక అంశాలు:

ఫ్లిప్‌కార్ట్, మారుమూల, తక్కువ సేవలు అందుతున్న ప్రాంతాలతో పాటు పట్టణ, పాక్షిక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పార్శిల్ డెలివరీ సేవల కోసం ఇండియా పోస్ట్ విస్తృతమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటుంది. సేవల్లో ప్రీపెయిడ్, క్యాష్ ఆన్ డెలివరీ పార్శిళ్ల డెలివరీ, ఓటీపీ ఆధారిత డెలివరీ ధృవీకరణ, రియల్-టైమ్ షిప్‌మెంట్ ట్రాకింగ్ వంటివి ఉన్నాయి.ఈ ఒప్పందం సమర్థవంతమైన పార్శిల్ రవాణా, పంపిణీ కోసం వేగవంతమైన డెలివరీ, మెరుగైన కార్యాచరణ సమన్వయం, అంతరాయలు లేని సాంకేతిక ఏకీకరణపై దృష్టి సారిస్తుంది.ఈ సహకారం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ రంగానికి మద్దతు ఇచ్చే లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. కంపెనీకి తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్‌ను వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. భాగస్వామ్యం ద్వారా ఫ్లిప్‌కార్ట్ భారతదేశవ్యాప్తంగా తపాలా శాఖకు చెందిన 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీసుల విస్తారమైన నెట్‌వర్క్‌ను, సాటిలేని డెలివరీ నెట్‌వర్క్‌ను పొందగలుగుతుంది. ఇది మార్కెట్ పరిధిని విస్తరించడానికి, పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సేవను అందించడానికి సహాయపడుతుంది.

అమెజాన్ ఇప్పటికే ఇండియా పోస్ట్‌తో భాగస్వామ్యం:

మారుమూల ప్రాంతాలకు సరుకులను చేరవేయడానికి అమెజాన్ ఇండియా గతంలో భారత తపాలా సేవతో భాగస్వామ్యం కుదుర్చుకుందని గమనించాలి. లాజిస్టిక్స్, ఇ-కామర్స్‌ను బలోపేతం చేయడానికి అక్టోబర్ 2024లో అమెజాన్, తపాలా శాఖ ఒక అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశాయి.

# రామ్‌చరణ్‌కు సర్జరీ..



## - కోయంబత్తూరుకు మెగా ఫ్యామిలీ...

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రేపు కోయంబత్తూరులోని ప్రముఖ గంగా ఆసుపత్రిలో మణికట్టు సర్జరీ చేయించుకోనున్నారు. 'పెద్ది' సినిమా షూటింగ్ సమయంలో ఆయన మణికట్టుకు గాయం అయినప్పటికీ, సినిమా ప్రమోషన్స్ పూర్తి చేసిన తర్వాత చికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. రేపు కోయంబత్తూరులోని ప్రముఖ గంగా హాస్పిటల్‌లో రామ్ చరణ్‌కు సర్జరీ జరగనుంది. ఈ నేపథ్యంలో ఈరోజే మెగా కుటుంబం కోయంబత్తూరుకు బయలుదేరుతోంది. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, ఉపాసనతో పాటు కుటుంబ సభ్యులు రామ్ చరణ్‌కు తోడుగా ఉండనున్నారు. ఈ సర్జరీను ప్రముఖ డాక్టర్ ప్రవీణ్, సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ రాజశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. అత్యాధునిక ఆర్థోపెడిక్ చికిత్సలకు పేరుగాంచిన గంగా హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్య బృందం ఈ శస్త్రచికిత్స చేయనుంది. ఆపరేషన్ విజయవంతంగా పూర్తై, అనంతరం రామ్ చరణ్ త్వరగా కోలుకుంటారని వైద్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని దేశవ్యాప్తంగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన కోసం ప్రార్థిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్ చరణ్ నటించిన లేటెస్ట్ సినిమా పెద్ది బ్లాక్ బస్టర్ అయ్యింది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా రూ. 400 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. కాగా దీని తర్వాత రామ్ చరణ్ తన తదుపరి సినిమాను క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్‌తో చేయబోతున్న సంగతి తెలిసిందే. =జ 17 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి కారణం రామ్ చరణ్- సుకుమార్ కాంబినేషన్ లో గతంలో రంగస్థలం అనే బ్లాక్ బస్టర్ వచ్చిన సంగతి తెలిసిందే. రామ్ చరణ్ గాయం నుంచి పూర్తిగా కోలుకోగానే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# కళ్యాణ్, పవన్ సాయి గురించి ట్రోల్స్

## - గట్టిగా ఇచ్చిపడేసిన తనూజ..



ముద్ద మందారం సీరియల్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది తనూజ పుట్టస్వామి. ఆ తర్వాత చాలా కాలం పాటు సీరియల్స్ కు దూరంగా ఉన్న తనూజ.. ఇటీవల బిగ్ బాస్ సీజన్ 9లో పాల్గొన్న సంగతితెలిసిందే. ఈ షో ద్వారా మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఒకానొక సమయంలో విన్నర్ అవుతుందని అంతా అనుకున్నారు. చివరి నిమిషంలో రన్నర్ అయ్యింది. ఇక బిగ్ బాస్ అనంతరం టీవీలో పలు షోలలో సందడి చేస్తుంది తనూజ. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా తన గురించి నెట్టింట వస్తున్న ట్రోల్స్ పై గట్టిగానే రియాక్ట్ అయ్యింది తనూజ.తనూజపై కొందరు వ్యక్తులు కుట్రలు చేస్తాన్నారని.. పవన్ సాయిని దూరం పెట్టారని.. కళ్యాణ్ పడాల వచ్చాకా పవన్ గురించి పట్టించుకోవడం లేదని.. తనూజ చాలా మారిపోయిందంటూ ఇష్టమొచ్చినట్లు కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తనూజ స్పందిస్తూ.. తన గురించి వస్తున్న ట్రోల్స్ పై గట్టిగానే ఆన్సర్ ఇచ్చింది. పనీ పాట లేనివాళ్లు మాత్రమే ఇలా రియాక్ట్ అవుతారని అన్నారు. బిగ్ బాస్ షో అయిపోయి ఏడు నెలలు అయ్యిందని.. ఇంకా ఆ షో గురించి అందులోని విషయాల గురించే ఎందుకు మాట్లాడుకుంటున్నారని అన్నారు.అవే కామెంట్స్ చేస్తున్నారని.. దయజేసి వాటిని వదిలేయాలని తెలిపింది. షోలో ఫైటింగ్ ఉంటుందని.. షో అయిపోయాక అలా ఉండలేమని అన్నారు. మేము బాగానే ఉన్నాం... మాకు లేని బాధ మీకెందుకో అర్థం కావడం లేదు అని ప్రశ్నించింది. తన గురించి చేస్తున్న కుట్రలు ఏంటో చెప్పాలని.. ఆ కుట్రలంటూ చేసే కామెంట్లను ఆపాలని.. ఖాళీగా ఉంటే ఆశ్రమానికి వెళ్లి మెడిటేషన్ చేసుకోవాలని..మైండ్ సరిగ్గా లేకపోతే ఆసుపత్రికి వెళ్లాలని సూచించింది. తన గురించి వచ్చే ట్రోల్స్, నెగిటివ్ కామెంట్స్ తనకు పంపొద్దని.. వాటిని చూస్తే తాను డిస్టర్బ్ అవుతానని అన్నారు. ల్యాణ్, నేను బాగానే ఉన్నామని, ఇప్పటికీ మంచి ఫ్రెండ్స్ అని, మా ఇంట్లో అతను తెలుసు, మా మధ్య మంచి రిలేషన్ ఉందని చెప్పింది. ప్రతిసారి ఎంఎం, పీఎస్ అంటున్నారు. కానీ బిగ్ బాస్ వెళ్లేందుకు వాళ్లే సపోర్ట్ చేశారని చెప్పుకొచ్చింది.

# హరారేలో చెలరేగిన వైభవ్..




## - జింబాబ్వే ముందు భారీ టార్గెట్..

**ఢిల్లీ :** వైభవ్ సూర్యవంశీ ఆడిన 81 పరుగుల ఇన్నింగ్స్ పుణ్యమా అని, మూడో టీ20లో భారత్ జింబాబ్వేకు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హరారేలో టాస్ గెలిచిన భారత్ మొదట బ్యాటింగ్ ఎంచుకుని, 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. వైభవ్ 49 బంతుల్లో 81 పరుగులు చేయగా, అందులో 8 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు.సూర్యవంశీ తన ఇన్నింగ్స్‌లో ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లు కొట్టాడు. మదేవరే బౌలింగ్‌లో బ్రాడ్ ఎవాన్స్ అద్భుతంగా క్యాచ్ పట్టడంతో అతను అవుటయ్యాడు. ఎవాన్స్ శ్రేయాస్ అయ్యర్‌ను కూడా ఔట్ చేశాడు. ఇషాన్ కిషన్ 29 పరుగుల వద్ద సికందర్ రజా బౌలింగ్‌లో అవుటవ్వగా, అభిషేక్ శర్మ రెండు పరుగుల వద్ద బ్లెస్సింగ్ ముజరబానీ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.తొలి రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించిన భారత జట్టు, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యం సాధించింది.

మరొకసారి మైదానంలో తుఫాను రేపాడు భారత విధ్వంసకర ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ. జింబాబ్వేతో జరుగుతున్న మ్యాచ్‌లో క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లోనే 8 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 81 పరుగులు చేసి మైదానాన్ని హోరెత్తించాడు. టీ20 ఫార్మాట్‌లో తనదైన శైలిలో విరుచుకుపడుతూ అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా ఏంటో మరోసారి చాటిచెప్పాడు.

ఆ ఒక్క షాట్.. సెంచరీ కళ నెరవేరలేదు!

తొలి సెంచరీ ఖాయం అనుకుంటున్న తరుణంలో 15వ ఓవర్‌లో ఊహించని మలుపు తిరిగింది. వెస్లీ మధ్వేరే వేసిన ఆఖరి బంతికి వైభవ్ భారీ షాట్‌కు ప్రయత్నించాడు. లాంగ్ ఆఫ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న బ్రాడ్ ఈవాన్స్ అసాధ్యమైన క్యాచ్‌ను సుసాధ్యం చేస్తూ ముందుకు డైవ్ చేసి బంతిని క్యాచ్‌గా మలుచుకున్నాడు. వైభవ్ మైదానం వీడలేక రీప్లే కోసం వేచి చూసినా, టీవీ అంపైర్ అది క్లీన్ క్యాచ్ అని స్పష్టం చేయడంతో తీవ్ర నిరాశతో వెనుతిరిగాడు.

సంచలన ఫామ్.. దిగ్గజాల ప్రశంసలు

కేవలం 15 ఏళ్ల వయస్సులోనే ఐపీఎల్ నుంచి అంతర్జాతీయ క్రికెట్ వరకు అద్భుత ప్రదర్శన చేస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు వైభవ్. ఎలాంటి ఒత్తిడి లేకుండా మైదానంలో ప్రతి బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడుతున్న అతని ఆటకు మాజీ దిగ్గజాలు, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సెంచరీ మిస్సయినా, అతను ఆడిన ఆ ఇన్నింగ్స్ జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించింది. శతకం చేజారినా తన అసాధారణ హిట్టింగ్‌తో మ్యాచ్ రూపురేఖలనే మార్చేసి క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడు వైభవ్ సూర్యవంశీ. రాబోయే మ్యాచ్‌ల్లో ఈ యువ సంచలనం ఇలాగే విజృంభిస్తే అతి త్వరలోనే తన తొలి అంతర్జాతీయ సెంచరీని అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# టీమిండియా హిస్టరీలోనే చెత్త రికార్డు

## - ఓపెనర్‌గా పీకేయండి అంటూ ఫ్యాన్స్ ఫైర్




**ఢిల్లీ :** జింబాబ్వే పర్యటనలో విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఘోర వైఫల్యం అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒకే ఒక్క బౌలర్ చేతిలో వరుసగా మూడు సార్లు వికెట్ సమర్పించుకుని, ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యంత తక్కువ పరుగులు చేసిన భారత ఓపెనర్‌గా అనవసరమైన చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

జింబాబ్వే టూర్‌లో అభిషేక్ శర్మకు ముజరబానీ గండం!

ఐపీఎల్‌లో ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడే యువ సంచలనం అభిషేక్ శర్మ నుంచి భారత క్రికెట్ అభిమానులు ఎంతో ఆశించారు. కానీ ఈ పర్యటన అతడికి ఒక పీడకలగా మారింది. జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ వేసిన పదునైన బంతులకు సమాధానం చెప్పలేక అభిషేక్ వరుసగా వికెట్ పారేసుకున్నాడు.

తొలి మ్యాచ్‌లో 8 బంతుల్లో కేవలం 1 పరుగు మాత్రమే చేసి ముజరబానీ బౌలింగ్‌లోనే వెనుతిరిగాడు. ఆ తర్వాత రెండో మ్యాచ్‌లోనైనా పుంజుకుంటాడని భావిస్తే, మళ్ళీ అదే బౌలర్ వేసిన బంతికి 8 బంతుల్లో 8 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఇక మూడో టీ20 మ్యాచ్‌లోనైనా పరిస్థితి మారుతుందనుకుంటే, మళ్లీ ముజరబానీ వేసిన బంతికే మరుమనికి క్యాచ్ ఇచ్చి కేవలం 2 పరుగులకే నిష్క్రమించాడు.

భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత చెత్త రికార్డు..!

మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఉన్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా దిగి అత్యంత తక్కువ పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. ఈ సిరీస్‌లో మూడు ఇన్నింగ్స్‌లు కలిపి అతను చేసింది కేవలం 11 పరుగులు మాత్రమే. దీనితో గతంలో ఉన్న పలువురు సీనియర్ ఆటగాళ్ల ప్రతికూల రికార్డులను అతను అధిగమించాడు.

2021లో ఇంగ్లాండ్‌పై కేఎల్ రాహుల్ చేసిన 15 పరుగులు ఇప్పటివరకు చెత్త రికార్డుగా ఉండగా, ఇప్పుడు 11 పరుగులతో అభిషేక్ శర్మ ఆ జాబితాలో అగ్రస్థానానికి చేరిపోయాడు.

తుది జట్టులో స్థానంపై సందేహాలు?

అంతర్జాతీయ స్థాయిలో వేగవంతమైన పేస్, అదనపు బౌన్స్ ఉన్న పిచ్‌లపై ఆడేటప్పుడు సాంకేతిక లోపాలు ఎంత ప్రమాదకరమో అభిషేక్‌కు ఈ సిరీస్ స్పష్టంగా గుర్తుచేసింది. ముఖ్యంగా ముజరబానీ వేసిన గుడ్ లెంగ్త్ బంతులను సరిగ్గా అంచనా వేయలేక ఇబ్బందిపడటం అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఓపెనర్‌గా వచ్చి పవర్-ప్లేను వాడుకోవడంలో పూర్తిగా విఫలమవ్వడం జట్టు యాజమాన్యానికి పెద్ద ఆందోళనగా మారింది.భారత జట్టులో చోటు కోసం తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో, వరుసగా మూడు అవకాశాలను వృథా చేసుకోవడం అభిషేక్ కెరీర్‌పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. రాబోయే సిరీస్‌లలో తన బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకోకపోతే తుది జట్టులో స్థానం కోల్పోయే ప్రమాదం ఉంది.